క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఈ

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లిలో నాడు-నేడు కింద చేపట్టిన అంగన్‌వాడీ భవనం, సమగ్ర సర్వశిక్ష అభియాన్ నిధులతో చేపడుతున్న ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాల పనులు, హసనాపురం పంచాయతీ వడ్డెపల్లె, చీకటివాండ్లపల్లె గ్రామాలలో జరుగుతున్న నాడు-నేడు పాఠశాలల పనులను మంగళవారం ఎస్‌ఎస్‌ఏ ఈఈ మురళీధరన్ పరిశీలించారు. ఆయనతో పాటు జేఈ జిలాని, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతు



మరమ్మతులు చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 21, 22వ తేదీలలో అనంతపురం గ్రామంలో జరిగే గంగమ్మ జాతర దృష్ట్యా భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డీఈ శ్రీనివాసులు, ఏఈ కిషోర్ కుమార్‌లు చేతి పంపులు, కుళాయిలకు మంగళవారం మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పాటించండి



వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేయిస్తున్న దృశ్యం

చిన్నమండెం : ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల్ కోడ్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల కోడ్‌ను పాటించాలని ఎంపీడీఓ దివ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆమె దగ్గరుండి అధికారులు, సిబ్బందితో తొలగింపజేశారు.

వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ

ఓబులవారిపల్లె : ఏపీటీడీసీ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాళ్లచెరువుపల్లి గ్రామంలోని జీవనజ్యోతి ఆనందనిలయం వృద్ధాశ్రమంలో దుస్తులను పంపిణీ చేశారు. యల్లాయపల్లి సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పోలి పాపిరెడ్డిలు ఆశ్రమంలోని వృద్ధులకు పంచలు, చీరలను అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు గల్లా శ్రీనివాసులు కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వెలుగు రికార్డుల ఆడిట్



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ సత్యనారాయణ

పెనగలూరు : మండలానికి సంబంధించిన వెలుగు రికార్డులను మంగళవారం పీడీ సత్యనారాయణ ఆడిట్ చేశారు. స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ, ఉన్నతి రికార్డులను ఆయన ఆడిట్ చేశారు. బ్యాంక్ లింకేజీలపై ఏపీఎం వెంకటరమణ, ఇతర సిబ్బందితో ప్రత్యేకంగా చర్చించారు. అలాగే అర్హులకు ఉన్నతి కింద రుణాలు ఎన్ని ఇచ్చారని, వాటిపై ఆరాతీశారు. అలాగే వెలుగుకు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఎం వెంకటేశు, వెంకటరమణ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన



రేకులకుంట చెరువు పనులపై ఆరాతీస్తున్న వెంకటేష్

సంబేపల్లె : మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ సుంకరాని చెరువులను ఐసిఐసిఐ ఫౌండేషన్ జోనల్‌హెడ్ వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిఐసిఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో ఇప్పటికే ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేశామన్నారు. ఇందులో భాగంగానే చెరువులకు మరమ్మతులు నిర్వహించి రైతులకు ఉపయోగపడే విధంగా చేయడం మా సంస్థకు ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం ఆయన పనులను పరిశీలించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. తమ గ్రామంలో చెరువు అభివృద్ధి చేస్తున్న ఫౌండేషన్‌కు గ్రామ సర్పంచ్ ఉదయకుమార్‌రెడ్డి, రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండండి



రామాపురం: రైతులకు అవగాహన కల్పిస్తున్న యువరైతు శ్రీనాథ్‌రెడ్డి



చిట్వేలి: తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



గాలివీడు: మామిడి రైతులకు సూచనలిస్తున్న అధికారిణి నాగమణి

- బొప్పాయి, అరటి, మామిడి పండ్ల తోటల రైతులకు అధికారుల సూచన
- నివారణ చర్యలను కర్షకులకు వివరించిన ఉద్యానవన శాఖాధికారులు

చిట్వేలి : బొప్పాయి, అరటి పంటలను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉంటూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారిణి ఆషియా సూచించారు. మంగళవారం నగిరిపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలో తెగుళ్ళపై రైతులకు ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారిణి ఆషియా మాట్లాడుతూ బొప్పాయి పంటలో సిఫార్సు చేసిన ఎరువులను వేయాలన్నారు. అలాగే సూక్ష్మ పోషకాలను పంటలకు తప్పనిసరిగా అందించాలన్నారు. అరటిలో ఆకుమచ్చ తెగులు(సిగటోక) దిగుబడి మీద తీవ్ర ప్రభావం చూపుతుందని, ఈ తెగులు సోకిన తోటలలో ఆకులపై మచ్చలు ఏర్పడి ఎండిపోతుందన్నారు. దీంతో గెలలు పూర్తిగా ముదరకముందే పడిపోయి కోయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నివారణలో భాగంగా వర్షాలు కురుస్తున్నప్పుడు ముందస్తుగా 2.5 గ్రాముల మ్యాంకోజెబ్ లేదా 2 ఎంఎల్ క్రోరోతాలో 1 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తెగులు ఆశించిన తోటలకు 1 ఎంఎల్ ప్రోపికొనజోల్ లేదా కార్బన్డాజిమ్, మ్యాంకోజెబ్ ఉన్నటువంటి శిలీంద్ర నాశిని 1 గ్రామ్ లేదా టెబ్రొ కొనజోల్, ట్రాపాక్షినిస్ట్ రోబిన్ ఉన్నటువంటి శిలీంద్ర నాశిని 1.2 ఎంఎల్ లేదా డైఫెన్ కొనజోల్ 1 ఎంఎల్ మందును 10 ఎంఎల్ బేనోయిల్ లేదా కెలియోల్ మినరల్ ఆయిల్‌తో కలుపుకొని ఆకులు పూర్తిగా తడిచేలా 25 రోజులు వ్యవధిలో 4 నుంచి 5 సార్లు పిచికారీ చేయాలని ఆమె రైతులకు అవగాహన సూచించారు. ఇలా మందులను పిచికారీ చేయడం వలన తెగుళ్లను పూర్తిగా నివారించువచ్చని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై..

రామాపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా మామిడి తోటలలో ప్రస్తుత సీజన్‌లో తోటబడి నిర్వహించి మంచి పూత పిందె ఉన్న సమయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి నాగమణి పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలు పాటించి మామిడి తోటల రైతులు మంచి దిగుబడిని పొందాలన్నారు. మండలంలోని రాచపల్లె గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ ఐటీ యువ రైతు శ్రీనాథ్‌రెడ్డి క్షేత్రాన్ని సందర్శించి అందులోని మెళుకువలను అధికారుల సమక్షంలో ఆయన క్షుణ్ణంగా వివరించారు. వీటిని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయపు యాజమాన్య పద్ధతులు వివరించారు. రైతులకు వేసవిలో పంట చిగుళ్ల సమయంలో ముద్దపూత పండు వర్షం వచ్చే సమయంలో చేయవల్సిన పద్ధతులను రెండు గంటల పాటు రైతులకు శిక్షణ ద్వారా వివరించారు. పూత, కాయ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సరిగ్గా పాటించక ధరను కోల్పోతున్నారన్నారు.

మామిడి పూత, పిందె సస్యరక్షణ చర్యలపై శిక్షణ

గాలివీడు : మామిడి పూత, పిందె దశలో రైతులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఉద్యానశాఖ అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నూలివీడు, సిసిపల్లె గ్రామాలలో మామిడి పూత, పిందె సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్లపూత దశ అనగా పిందె బఠానీ గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనెమంచు పురుగు, బూడిద తెగులు, పక్షికన్ను తెగులు, పిందె రాలడం వంటి తెగుళ్ల నివారణకు థయో మిథక్సేన్ 0.3 గ్రాములు లీటరు నీటికి, రోకో ఒక గ్రాము లీటరు నీటికి, ప్లానోఫిక్స్ 0.25 మిల్లీ లీటరు నీటికి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు రాణా ప్రతాప్, వికాస్ కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం చేసిన ఎమ్మెల్యే

రాయచోటి అర్బన్ : సోమవారం పీలేరువద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మదీనా మజీద్ అంబులెన్స్ డ్రైవర్ సమీవుల్లా వైద్యం కోసం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. అంబులెన్స్ నిర్వాహకుడు సాహుల్ హమీద్, క్షతగాత్రుడు సమీవుల్లా కుటుంబీకులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. అలానే వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ యువనేత బేపారి మహమ్మద్‌ఖాన్ కూడా సమీవుల్లా వైద్యానికి రూ.25 వేలు నగదును ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు రూ.50 వేల ఆర్థికసాయాన్ని సాహుల్ హమీద్‌కు ప్రభుత్వ ఖాజీ షర్ఫుద్దీన్ సాహెబ్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, ఎమ్మెల్యే పీఏ నిస్సార్ అహమ్మద్, మైనార్టీ నేతలు బేపారి అసద్‌ఖాన్, మైనుద్దీన్, తాలిబ్ తదితరులు పాల్గొన్నారు.



సాహుల్ హమీద్‌కు నగదును అందజేస్తున్న దృశ్యం

ప్రాజెక్టుల సందర్శనను జయప్రదం చేయండి



వివరాలు తెలుపుతున్న పీఎల్ నరసింహులు

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను సీపీఐ రాష్ట్రనేతల బృందం సందర్శించనుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆపార్టీ కార్యాలయంలో ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ నేతృత్వంలో పార్టీ నేతల బృందం ఈనెల 13 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను సందర్శిస్తుందన్నారు. ఇందులో భాగంగా 14వ తేదీ వెలిగల్లు ప్రాజెక్టు, 15వ తేదీన మదనపల్లె ప్రాంతంలోని హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తారన్నారు. కార్యక్రమానికి రైతులు, మేధావులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ, రాయచోటి నేతలు వెంకటేశు, సుబ్బయ్య, ఏఐవైఎఫ్ నేత జక్కల వెంకటేష్ పాల్గొన్నారు.

చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటండి

ఉపాధి హామీ పీడీ మద్దిలేటి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

చిన్నమండెం : రైతులు ఉపాధి హామీ పథకం కింద సాగు చేసి చనిపోయిన పలు రకాల పండ్ల మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లోని సభాభవనంలో 17వ రౌండ్ సోషల్ ఆడిట్ సమావేశం నిర్వహించారు. 01.04.2021 నుంచి 31.03.2022 వరకు చేసిన పనులను తనిఖీలు చేశారు. ఈజీఎస్, పీఆర్, ఎస్ఎస్ఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఫారెస్ట్ అన్ని శాఖలు కలిపి రూ.11,34,03,988 ఆడిట్ చేసినట్లు పీడీ తెలిపారు. ఆడిట్‌లో రూ.2,20,000 ముఖ్యంగా పని ప్రదేశంలో నేమ్‌బోర్డ్స్ లేవని, అదే విధంగా ప్లాంటేషన్ వర్కులకు మొక్కలు చనిపోయాయన్నారు. 13 గ్రామ పంచాయతీలకు గాను రూ.11,500 రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ రవికుమార్, ఎంపీడీఓ దివ్య, ఎస్ఆర్‌పీ తిరుమలేశ్, ఏపీఎం దేవసేన, జేసీ హరూన్‌బాషా, ఏపీఓలు హరిప్రసాద్,మాధవి, ఉపాధి సిబ్బంది, ఎస్‌ఏటీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు కనీస సామర్థ్యాలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న విజయకుమార్

సంబేపల్లె : పాఠశాలలో చదివే విద్యార్థులందరూ కనీస సామర్థ్యాలు కలిగి ఉండాలని లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకుడు విజయకుమార్ మంగళవారం అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న అభ్యసనా అభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. కోవిడ్ కారణంగా పాఠశాలలు చాలా రోజులు మూతపడటంతో విద్యార్థుల సామర్థ్యాలపై ప్రతికూల ప్రభావం పడిందన్నారు. అందువలన ప్రభుత్వపాఠశాల విద్యార్థులలో కనీస విద్యా ప్రమాణాలు పొంపొందించడానికి లిప్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఇందుకోసం ప్రారంభదశ పరీక్షలు, నెల పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలు ఆధారంగా విద్యార్థులకు గ్రేడ్‌లు విభజించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ వేసిన రైతులకే యూరియాను విక్రయించండి



ఎరువుల షాపును పరిశీలిస్తున్న వైవి రమణారావు

రాయచోటి టౌన్ : వేలిముద్రలు సేకరించిన రైతులకు మాత్రమే యూరియా అమ్మాలని ఎరువుల దుకాణాల తనిఖీ అధికారి, పీలేరు ఏడీఏ వైవి రమణారావు ఎరువుల వ్యాపారులకు సూచించారు. మంగవారం ఆయన రాయచోటిలోని పలు ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల షాపులలోని రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని చెప్పారు. అలా కాకుండా అధిక ధరలకు అమ్మినా బ్లాక్ మార్కెట్‌లో విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే రైతులకు నానో యూరియాను పరిచయం చేయాలని చెప్పారు. దీని వలన రైతులకు భారం, వ్యయ ప్రయాసాలు లేకుండా సులభంగా వ్యవసాయం చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట రాయచోటి ఏఓ దివాకర్ ఉన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వం చేయూత

జగనన్న పాల వెల్లువపై అవగాహన కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్‌నాయక్



సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శేఖర్‌నాయక్

గాలివీడు : జగనన్న పాల వెల్లువ ద్వారా ప్రభుత్వం పాడి రైతులకు చేయూతనందిస్తుందని ఎంపీడీఓ శేఖర్ నాయక్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన జగనన్న పాల వెల్లువ అమూల్ పాల సేకరణ కేంద్రాల ఏర్పాటు, పర్యవేక్షణ తదితరాలపై ఎంపీడీఓ శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌బీకే కేంద్రాల సహాయకులు, సచివాలయ సిబ్బందికి అమూల్ సంస్థ, కో-ఆపరేటివ్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ శేఖర్ నాయక్ మాట్లాడుతూ మండలంలో 13 ఆర్‌బీకే కేంద్రాల పరిధిలో 27 పాల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు ఆయా గ్రామాలలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని, వీటి పర్యవేక్షణకు ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, అసిస్టెంట్ సెక్రటరీలను ఎంపిక చేస్తూ ఒక్కో పాల సేకరణ కేంద్రం పరిధిలో 9 మందిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల పంచాయతీ సెక్రటరీల, అమూల్ సంస్థ ప్రతినిధులు, కో-ఆపరేటివ్ సంస్థ సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘జీవన శైలిలో మార్పులతో ఆరోగ్యం’



రాయచోటి అర్బన్: జాతీయ రహదారిపై ర్యాలీగా వస్తున్న వైద్య ఉద్యోగులు, విద్యార్థులు

రాయచోటి అర్బన్ : జీవనశైలిలో మార్పులతో ఆరోగ్యంగా ఉండవచ్చంటూ అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా రాయచోటిలో మంగళవారం డీఎంఅండ్‌హెచ్ కార్యాలయం నుంచి పట్టణంలోకి విద్యార్థులు, వైద్య ఉద్యోగులు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులకు ప్రతి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహిస్తారన్నారు. క్యాంపులలో షుగర్, బిపి, గుండెజబ్బులు, థైరాయిడ్, క్యాన్సర్, పక్షవాతం లాంటి వ్యాధులను తొలిదశలోనే గుర్తించి వైద్య చికిత్సలు చేస్తామన్నారు. జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శేషగిరి బాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 374 హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కేంద్రాల్లో అవసరమైన వారికి ఒక సీహెచ్‌ఓతో పాటు ఎంఎల్‌హెచ్‌సీలు అవసరమైన వారికి 14 రకాల పరీక్షలు నిర్వహించి 67 రకాల మందులు అందజేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో భాగంగా సైకిల్ తొక్కడం వలన ఒత్తిడి, గుండె జబ్బులకు గురికాకుండా రక్షణను పొందవచ్చునన్నారు. మాంసాహారాన్ని తగ్గించి శాఖాహారం తీసుకోవడం ద్వారా ఊబకాయం, అల్సర్ వంటి రోగాల నుంచి ఉపశమనం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో దేవశిరోమణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, డీఐఓ డాక్టర్ ఉషశ్రీ,, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, డీఎస్‌ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఎంఓ వేణుగోపాల్, ఎస్ఓ ఓబులరెడ్డి, హెచ్ఈఓ సత్యనారాయణ, సీహెచ్‌ఓ యాదవ్, పర్యవేక్షకుడు వెంకటేశ్వరరెడ్డితోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామం ఆరోగ్యానికి మంచిది



పుల్లంపేట: సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యులు

పుల్లంపేట : ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడంతో కొన్ని వ్యాధులు దరిచేరవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్, డాక్టర్ మనోజ్ చంద్రలు తెలియజేశారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రం నుంచి సైకిల్ యాత్రను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం, వ్యాయామం చేయడం వలన శారీరక బరువు తగ్గి మానసిక ఒత్తిడికి గురికాకుండా దీర్ఘకాలిక వ్యాధులైన గుండెజబ్బు, క్యాన్సర్ వంటి వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. ఆకు కూరలు తిందాం-ఆరోగ్యంగా ఉందాం, మాంసాహారం వద్దు.. శాఖాహారం ముద్దు అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశం, సీహెచ్‌ఓ వి.రాజ, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు కనీస వేతనాన్ని చెల్లించండి

రాయచోటి అర్బన్ : వీఆర్‌ఏలకు ముఖ ఆధారిత హాజరు నమోదు (ఫేస్ అటెండెన్స్) యాప్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏలు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు సీఎం జగన్ గతంలో ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే నెరవేర్చాలన్నారు. వీఆర్‌ఏలకు కనీసవేతనంగా రూ.18 వేలు జీతం చెల్లించాలన్నారు. గౌరవవేతనంతో పనిచేసే వీఆర్‌ఏలకు వెంటనే అన్ని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలుపరచాలంటూ కోరారు. అర్హత కలిగిన వారికి వీఆర్‌ఓలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ సత్యనారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వీఆర్‌ఏలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత పయాజ్, రామచంద్ర, వీఆర్‌ఏల సంఘం జిల్లా జిల్లా కన్వీనర్ ఎస్.అల్లాబకష్, భోగేశ్వరయ్యతో టు జిల్లాలోని పలు ప్రాంతాల నేతలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

వేరుశనగ పంటను పరిశీలించిన అధికారి

సంబేపల్లె : మండల పరిదిలోని గురిగింజకుంట పంచాయతీలో రబీలో సాగుచేసిన వేరుశనగ పంటను విజయవాడ వ్యవసాయ కమిషనర్ కార్యాలయ అధికారి చంద్రపూర్ణేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను నమోదు చేసుకోవడం వలన పీఎంకిసాన్, రైతుభరోసా, వడ్డీలేని రుణాలు తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఇందులో మండల ఏఓ రాముంజల రెడ్డి, ఎస్ఓ కేశవులు, రెడ్డివెంకటరమణ పాల్గొన్నారు.

సర్వేను పూర్తి చేయండి

సిద్దవటం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల కోసం చేపట్టిన సర్వేని వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు సమన్వయంతో వంద శాతం పూర్తి చేయాలని కడప డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని పెద్దపల్లె, బొగ్గిడివారిపల్లె, మాధవరం-1, మాధవరం-2, ఉప్పరపల్లె గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్.డి.జి. సర్వే నాలుగు రకాలుగా ఉంటుందన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణీ స్త్రీలు, 0-5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు ఈకేవైసీ, 6-19 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఈకేవైసీ, 10-19 సంవత్సరాల చిన్నారులకు రక్తహీనత ఉన్న కౌమార బాలికలకు సంబంధించిన సర్వే ఈనెల 6న ప్రారంభమైన సర్వేని సిబ్బంది వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

వెన్నపూసను మెజార్టీతో గెలిపించుకుందాం

జెడ్పీ చైర్మన్ అమరనాథరెడ్డి



నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి


రాజంపేట రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు.

మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌కు మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డితో కలిసి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఎన్నికలలో చేపట్టవలసిన ప్రచార కార్యక్రమానికి సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రరెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించినందున ప్రతి పట్టభద్రుని ఓటు వెన్నపూసకు వేసి మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలియజేశారు.

ప్రజల శ్రేయస్సుకు ప్రాధాన్యం

రాష్ట్రంలోని ప్రజల శ్రేయస్సుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి తెలిపారు. మండల పరిధిలోని మందపల్లి పంచాయతీలోని దళితవాడని మంగళవారం ఆకేపాటి సందర్శించారు. మందపల్లి దళితవాడ ప్రజలు తాగునీటి సౌకర్యం కల్పించాలని మంగళవారం ఉదయం ఆకేపాటి ఎస్టేట్‌కు వచ్చి కోరారు. అధికారులతో మాట్లడి సమస్యను పరిష్కరించడంతో దళితవాడ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం సమర్పిస్తున్న ఏఎన్‌ఎంలు

రాయచోటి అర్బన్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఏఎన్‌ఎంల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని ఏపీ సచివాలయ ఏఎన్‌ఎం, హెల్త్ సెక్రటరీస్ అండ్ అదర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లీలావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె పలువురు ఏఎన్‌ఎంలతో కలసి జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజను కలుసుకుని తమ సమస్యల పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. లీలావతి మాట్లాడుతూ సచివాలయాల ఏఎన్‌ఎంలు 40 రకాల ఆన్‌లైన్ యాప్‌లను నిర్వహించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే అనవసరమైన యాప్‌ల నిర్వహణను కుదించి ఏఎన్‌ఎంలపై పనిభారాన్ని తగ్గించాలంటూ కోరారు. ఏఎన్‌యంలను ఏదో ఒక శాఖకు మాత్రమే అటాచ్ చేయాలన్నారు. సెలవులు తీసుకునేందుకు ఏశాఖ నుంచి అనుమతులు పొందాలో తెల్పాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంల సంఘం నాయకురాళ్ళు మాధవి, స్వరూప, శంకరమ్మ, సరస్వతి, సావిత్రి, శ్రీవిద్య, అనురాధ, ధనమ్మ, హేమలత, జ్యోతి, ఖాదరున్నీసా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



ప్రాక్టికల్స్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకుడు

రాజంపేట టౌన్ : విద్యార్థులు పాఠ్యాంశాల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించుకున్నప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్రం, కంప్యూటర్‌కు సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రయోగాలు చేసే విధానాన్ని అధ్యాపకులు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా సైన్స్, ఒకేషనల్ కోర్సు చేసే విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో బాగా తర్ఫీదు పొంది ఉండాలన్నారు. అప్పుడే ఆయా పాఠ్యాంశాల్లో మంచి మార్కులు సాధించగలరని తెలిపారు. ప్రాక్టికల్స్‌పై పూర్తిస్థాయిలో పట్టు సాధిస్తే ఉన్నత చదువులకు, అనంతరం ఉద్యోగ అవకాశాల సులువుగా పొందేందుకు వీలవుతుందన్నారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకూడదన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నందున తమ అధ్యాపకులు ప్రాక్టికల్స్‌పై కల్పించిన అవగాహన విద్యార్థులకు ఎంతో దోహదపడగలదని తెలిపారు.